

ఫార్మా కార్మికులకు భద్రతకు..

ఫార్మా, సెజ్ కంపెనీల్లోని కార్మికులకు భద్రత కల్పించాలని సీపీఎం నిర్వహిస్తున్న రక్షణ యాత్ర తోటాడ చేరుకుంది. 8లో



పంచామృతాభిషేకం

డాబాగార్డెన్స్: విశాఖ బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు.



మళ్లీ వర్షాలు

సాక్షి, పాడేరు: మళ్లీ వర్షాలు కురుస్తున్నాయి. పాడేరు పరిసరాల్లో మధ్యాహ్నం మూడు గంటల నుంచి భారీ వర్షం కురిసింది.

మాటలు కోటలు దాటాయి.. చేతలు ఇంకా ప్రారంభమే కాలేదు.. అలవికాని వాగ్దానాలు, అడుగడుగునా అబద్ధాల కోటలు కట్టి అందలమెక్కిన కూటమి ప్రభుత్వం.. వందరోజులైనా ఏ ఒక్క హామీ గురించి పట్టించుకోకుండా గాలికొదిలేసింది. అధికారంలోకి వస్తే.. అది చేస్తాం.. ఇది చేస్తామంటూ ఉత్తర కుమారుల ప్రగల్భాలు పలికిన చంద్రబాబు అండ్ కో.. ఇప్పుడు ఉత్త చేతులు చూపిస్తున్నారు. సూపర్ సిక్స్ పథకాలకే కాదు.. స్థానికంగా ఇచ్చిన హామీలకు మంగళం పాడేశారు. పలుమార్లు జిల్లాకు వచ్చినా.. హామీల గురించి ఏమాత్రం ప్రస్తావించకుండా.. రిక్త హస్తాలతో దగా చేస్తున్నారు. ఎన్నికల ప్రచారంలో వంగి వంగి దండాలు పెట్టిన కూటమి నేతలు.. ఇప్పుడు ఓటేసిన ప్రజలందరికీ పంగనామాలు పెడుతున్నారు. అసలు చంద్రబాబు, పవన్‌కల్యాణ్, లోకేష్.. జిల్లాలో పర్యటించినప్పుడు ఇచ్చిన హామీలేంటి.? అవి కార్యరూపం దాల్చాయా లేదా అన్నది వంద రోజుల పాలన పూర్తయిన సందర్భంగా ఓసారి పరికిస్తే...

ప్రోగ్రెస్ రిపోర్ట్ వెరీ పూర్

వంద రోజులు.. సున్నా మార్కులు

- చంద్రబాబు, పవన్ కల్యాణ్ హామీలకు అతీ గతీ లేదు
- వంద రోజులైనా అడుగు కదపని కూటమి సర్కార్





ఎన్నికల ముందు వివిధ సందర్భాల్లో కూటమి నేతల హామీ వార్తల క్లిప్పింగ్స్

సాక్షి, అనకాపల్లి: అలవికాని హామీలు ఇచ్చి.. అరచేతిలో స్వర్గం చూపించారు. సూపర్ సిక్స్ అంటూ వంచనకు తెర తీశారు. ఏనాడో అమలు చేయాల్సిన అన్నదాతా సుఖీభవ, తల్లికి వందనం పథకాలను గాలికి వదిలేసినప్పుడే కూటమి సర్కారు నైజం ప్రజలకు అర్థమయింది. ప్రభుత్వం చిత్తశుద్ధిని అంచనా వేయడానికి కనీసం వంద రోజులు సమయం ఇవ్వాలని వేచి చూసి నేతల వైఖరిని బేరీజు వేస్తే అందరికీ సున్నా మార్కులే పడుతున్నాయి. మూడు నెలల్లో అన్ని హామీలను పూర్తి చేయలేకపోవచ్చు. కానీ నెరవేర్చాలన్న ధోరణి ప్రజాప్రతినిధుల్లో కనిపించడం లేదు. ఒక్క అడుగైనా ముందుకు పడలేదు. కనీసం ప్రతిపాదనల దశ దాటలేదు. అందుకే ప్రజల్లో చింతన మొదలైంది. తప్పు చేశామన్న భావన వ్యక్తమవుతోంది.

నేతలూ.. ఏమయ్యాయి మీ నీతులు?

మే 6వ తేదీన తాళ్లపాలెంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, చంద్రబాబు ఒకే వేదికపై నుంచి జిల్లాకు అనేక హామీలు ఇచ్చారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు పనులను అధికారంలోకి వచ్చిన మరుక్షణమే పునఃప్రారంభిస్తామని చెప్పారు. ఏప్రిల్ 14న పాయకరావుపేటలో చంద్రబాబు నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదలకు ఒక సెంటు భూమి ఇస్తోందని.. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రెండు సెంట్లు ఇస్తామని హామీ ఇచ్చారు. వలంటీర్ల జీతం రూ.10 వేలకు పెంచుతామన్నారు. ఇప్పుడు వారి ఉద్యోగాలకే ఎసరు పెట్టారు. జనసేన అధ్యక్షుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఫిబ్రవరి 4న వారాహియాత్రకు వచ్చి ఎన్నో హామీలు ఇచ్చారు. అధికారం చేపట్టి 100 రోజులు పూర్తయినా అందులో ఒక్కటీ అమలుకు నోచుకోలేదు.

పింఛన్లు మినహా ఏవీ అమలుకు నోచుకోలేదు..

ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల్లో సామాజిక పింఛను తప్ప ఏదీ కూడా అమలు కాలేదు. ఎన్నికలకు ముందు యువగళం పేరుతో అనకాపల్లి జిల్లాలో పర్యటించిన నారా లోకేష్ కూడా ఎన్నో హామీలు ఇచ్చారు. పవన్ కల్యాణ్ అనకాపల్లి, యలమంచిలి, పెందుర్తి నియోజకవర్గాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభల్లో ఎన్నో ఆశలు కల్పించారు. ఉచితంగా ఇసుక సరఫరా చేస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీ ఉత్తుత్తిదే అని తేలిపోయింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కనీసం ఇసుక సొమ్ము ప్రభుత్వానికి చేరేదని, ఇప్పుడు కూటమి నేతల జేబులు నింపుతోందనే విమర్శ బలంగా వినిపిస్తోంది. ఇక సూపర్ సిక్స్.. సూపర్ ఫ్లాప్‌గా మిలిగిపోయింది.

శారదా నది బ్రిడ్జి

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కశింకోట బ్రిడ్జి నిర్మాణానికి రూ.2.7 కోట్లు మంజూరు చేశారు. తొలి విడతలో రూ.80 లక్షల పనులు జరిగాయి. రెండో విడత నిధులు మంజూరు అయ్యేనాటికి ఎన్నికలు వచ్చాయి. కూటమి పార్టీల నేతలు తాము అధికారంలోకి వస్తే పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. కూటమి అధికారం చేపట్టి వంద రోజులైనా ఆ పనులు కొనసాగించలేదు.

నూకాలమ్మ ఆలయ రోడ్డు విస్తరణ

అనకాపల్లి టౌన్‌లో నూకాలమ్మ ఆలయం రోడ్డు విస్తరణ చేపడతామని కూటమి నేతలు హామీ ఇచ్చారు. కానీ ఇంతవరకు శ్రీకారం చుట్టలేదు. ఈ రోడ్డు విస్తరణకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.3 కోట్ల నిధులు మంజూరయ్యాయి. పనులు ప్రారంభం కాలేదు. పూర్తి చేస్తామని హామీ ఇచ్చిన నేటి ప్రజాప్రతినిధులు నిధులు సిద్ధంగా ఉన్నా పనులు మొదలు పెట్టలేదు.

నర్సీపట్నం– చోడవరం రోడ్డు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 2022లో నర్సీపట్నం–చోడవరం రోడ్డు నిర్మాణానికి రూ.112 కోట్లు మంజూరు చేశారు. టీడీపీకి చెందిన కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా నిర్మాణ పనులు నిలిచిపోయా యి. ఎన్నికలకు ముందు చంద్రబాబు, పవన్ కల్యా ణ్ ఇద్దరూ అధికారం వచ్చిన మూడు నెలల్లో నర్సీపట్నం– చోడవరం రోడ్డు నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. కానీ ఇప్పుడు ఆ ఊసే లేదు.



బ్రిడ్జి నిర్మించాల్సిన శారదా నది



అధ్వానంగా నర్సీపట్నం–చోడవరం రోడ్డు

ఉత్తర కుమారుల ప్రగల్భాలు

జిల్లా పర్యటనలో చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేష్ అనేక హామీలు ఇచ్చారు. వాటిలో కొన్ని..

- ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టును పూర్తి చేస్తాం
- నుకాలమ్మ జాతరకు రాష్ట్ర హోదా
- చోడవరం – నర్సీపట్నం రోడ్డు నిర్మాణం
- 'మోడల్'గా అనకాపల్లి జిల్లా
- తుమ్మపాల సుగర్ పరిశ్రమకు అనుసంధానంగా ఇథనాల్ ఫ్యాక్టరీ
- అనకాపల్లిలో తయారయ్యే నల్లబెల్లం అమ్మేందుకు రాష్ట్ర అనుమతులు
- శారద నది ఒడ్డున అన్నమయ్య ఉద్యానవన పార్క్
- శారద నది బ్రిడ్జి నిర్మాణం
- అగనంపూడి నుంచి అనకాపల్లి పట్టణానికి పైప్‌లైన్ల ద్వారా తాగునీటి సరఫరా
- 'బరోడా' మాదిరి అనకాపల్లిలో దుర్గంధం లేకుండా వ్యర్థాలను శుద్ధి చేసే అధునాతన ప్లాంట్
- పరవాడ ఎన్టీపీసీ, ఫార్మా కంపెనీలలో స్థానిక యువతకు ఉపాధి కల్పించే దిశగా చర్యలు తీసుకుంటాం

న్యూస్‌రీల్

కదిలిన అధికారులు

- ఇసుక తవ్వకాలకు చెక్



గొట్టివాడ శివారున ఇసుక తవ్వకాలను నిరోధిస్తూ బాటకు గాడి కొట్టిస్తున్న తహసీల్దార్ జానకమ్మ

కోటవురట్ల: సాక్షిలో వెలువడిన 'తవ్వరా.. మనల్ని అడ్డుకునేదెవరు!..' కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. గొట్టివాడ శివారున పైలట్ ప్రాజెక్టు సమీపంలో కూటమి నాయకులు ఇసుక దందా సాగిస్తున్న వైనాన్ని సాక్షి బట్టబయలు చేసింది. పైలట్ ప్రాజెక్టుకు ఉన్న ప్రమాదాన్ని వివరించడంతోపాటు, ప్రభుత్వ ఖజానాకు గండి పడుతున్న వైనాన్ని తెలియజేసింది. దీంతో తహసీల్దార్ జానకమ్మ, ఎస్ఐ రమేష్‌తో కలిసి గురువారం ఇసుక నిల్వలపై దాడి చేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నట్టు గుర్తించామన్నారు. ఇకపై తవ్వకాలు జరపకుండా బాటకు అడ్డుగా పొక్లెయిన్‌తో ట్రెంచ్ కొట్టించినట్టు తెలిపారు. నిఘా పెడుతున్నామని, వీఆర్ఏలు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తారని తెలిపారు. పోలీసులు కూడా రాత్రి వేళల్లో రౌండ్స్ వేసేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు.

యాక్షన్ ప్లాన్ లక్ష్యాలను సాధించాలి : జేసీ



తుమ్మపాల: జిల్లాలో 100 రోజుల యాక్షన్ ప్లాన్‌లో అనుకున్న లక్ష్యాలను సాధించాలని జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి అన్నారు. కలెక్టర్ కార్యాలయ సమావేశం మందిరంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వ్యవసాయం, హార్టికల్చర్, సెరికల్చర్, డీఆర్డీఏ, పశుసంవర్ధక, మత్స్య, డ్వామా, మెప్మా, మైన్స్ అండ్ జియాలజీ, పంచాయతీరాజ్, నీటిపారుదల, భూగర్భ జలాలు, విద్య, అటవీ శాఖల లక్ష్య సాధనలో పురోగతిపై అధికారులతో ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల పురోగతిపై ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. కొన్ని శాఖల పనితీరు మెరుగుపరుచుకోవాలని ఆదేశించారు. నిర్దేశించిన లక్ష్యాలను ఈనెల 20 నాటికి అన్ని శాఖల అధికారులు పూర్తి చేయాలన్నారు. సమీక్ష సమావేశంలో సీపీవో రామారావు, గృహనిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ వై.శ్రీనివాసరావు, డీఎంహెచ్‌వో డాక్టర్ బాలాజీ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

పర్యాటక అవార్డులకు దరఖాస్తుల స్వీకరణ

తుమ్మపాల : పర్యాటక రంగంలో 2023– 24 ఏడాదికి అవార్డుల కోసం ఈ నెల 22వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా పర్యాటక శాఖ అధికారి ఎస్.వి.ఎస్.సుబ్బలక్ష్మి ఒక ప్రకటనలో కోరారు. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 27న నిర్వహించే కార్యక్రమంలో అవార్డుల ప్రదానం జరుగుతుందన్నారు. టూరిజం రంగానికి చెందిన అర్హులైన వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ఆమె తెలిపారు. పర్యాటక రంగంలో మొత్తం 38 విభాగాల నుంచి 41 అవార్డులకు దరఖాస్తులు చేసుకోవచ్చని సూచించారు. దరఖాస్తులను టూరిజం వెబ్‌సైట్ www.aptourism.gov.in నుంచి డౌన్‌లోడ్ చేసుకుని పూర్తి చేసిన తర్వాత ఏపీ టూరిజం అథారిటీ, 5వ ఫ్లోర్, స్టాలిన్ కార్పొరేట్ బిల్డింగ్, ఆటోనగర్, విజయవాడ చిరునామాకు ఈ నెల 22లోగా అందజేయాలని కోరారు.

ఏసీబీకి చిక్కిన ఉద్యోగి విధుల నుంచి తొలగింపు

అనకాపల్లి: లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్ ఒ.కుమార్‌ను విధుల నుంచి తొలగించారు. బుధవారం రూ.30 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ డీఎస్పీలు నాగేశ్వరరావు, రమ్యలు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న విషయం తెలిసిందే. పూర్తి విచారణ అనంతరం అదే రోజు రాత్రి జిల్లా విద్యాశాఖ కార్యాలయం నుంచి విశాఖ ఏసీబీ కార్యాలయానికి తీసుకువెళ్లారు. కలెక్టర్ ఆదేశాల మేరకు కుమార్‌ను శుక్రవారం విధుల నుంచి సస్పెండ్ చేసినట్టు డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ ఒక ప్రకటనలో చెప్పారు.

దళితుల సమస్యలు పరిష్కరించాలి



మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న బాబూరావు

సీతమ్మధార: దళితుల సమస్యలు పరిష్కరించాలని రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రి వీరేంద్రకుమార్‌కు కోరారు. ప్రభుత్వ అతిథిగృహంలో గురువారం కేంద్రమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా బాబూరావు దళితులు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారు

సులభంగా ఇసుక బుకింగ్



ఇసుక విధానంపై పోస్టర్‌ను విడుదల చేస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్, జేసీ ఎం.జాహ్నవి

- ఏపీ సాండ్ మేనేజ్‌మెంట్ సిస్టం పోర్టల్ ద్వారా ఇసుక సరఫరా

తుమ్మపాల: ఇసుక కావాల్సిన వారు ఏపీ సాండ్ మేనేజ్‌మెంట్ సిస్టం పోర్టల్ ద్వారా సులభంగా ఇసుక పొందవచ్చని కలెక్టర్ విజయ కృష్ణన్ తెలిపారు. రాష్ట్రంలో నూతన ఇసుక విధానంపై సీఎం చంద్రబాబు విజయవాడ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వర్చువల్ కాన్ఫరెన్స్‌లో జిల్లా నుంచి కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి పాల్గొన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఇసుకను నేరుగా డోర్ డెలివరీ జరిగేలా బుక్ చేసుకునే వెసులుబాటు ప్రభుత్వం కల్పించిందన్నారు. ప్రభుత్వ విధానాల ప్రకారం ఇసుక వినియోగదారులకు సూచనలు, ఇసుక రవాణా వాహనదారులకు సూచనలతో కూడిన గోడ పత్రికను కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. వాహనదారులు తమ వాహనం ద్వారా ఇసుక రవాణా చేయాలనే ఆసక్తిని జిల్లాలోని జిల్లా మైన్స్ జియాలజీ ఆఫీసర్‌కు తెలియజేయాలని, ప్రత్యేకంగా ఇసుక వాహనాల రవాణా కోసం సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించి, వాహనానికి సంబంధించి సరైన పత్రాలు సమర్పించి నమోదు చేసుకోవాలన్నారు. ప్రతి రోజు ఉదయం 6 గంటల నుంచి కేటాయింపులు మొదలవుతాయని, ప్రభుత్వ సెలవు దినాలలో కేటాయింపులు జరగవని తెలిపారు.

చూచుకొండలో దారుణం

- భార్యాభర్తలపై హత్యాయత్నం
- అనంతరం నిందితుడి ఆత్మహత్య
- వివాహేతర సంబంధమే కారణమని అనుమానం



కేజీహెచ్‌లో అపస్మారక స్థితిలో ఉన్న కొయిలాడ చంద్ర



చంద్ర భర్త మోహన్



ఆత్మహత్యకు పాల్పడిన నిందితుడు సోంబాబు (ఫైల్)

మునగపాక: కొంతకాలంగా తనతో మాట్లాడకపోగా, ఫోన్ చేసినా స్పందించకపోవడాన్ని తట్టుకోలేక వివాహితపై దాడికి దిగి, అడ్డం వచ్చిన భర్తపై కూడా దాడి చేసిన ఘటన మునగపాక మండలం చూచుకొండలో గురువారం జరిగింది. దాడి అనంతరం నిందితుడు రైల్వే ట్రాక్‌పై ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలిలా ఉన్నాయి. చూచుకొండకు చెందిన కొయిలాడ మోహన్ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మోహన్ భార్య చంద్ర అచ్యుతాపురంలోని బ్రాండిక్స్ కంపెనీలో పనిచేస్తోంది. ఇదే గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ కాండ్రేగుల సోంబాబు(41)తో చంద్రకు గతంలో వివాహేతర సంబంధంపై గొడవలు జరిగాయి. పెద్దల సమక్షంలో పలుమార్లు పంచాయతీలు నిర్వహించారు. ఒకరితో మరొకరు సంబంధం లేకుండా బతకాలని గ్రామ పెద్దలు హితవు పలికారు. అయినప్పటికీ సోంబాబులో మార్పు కనిపించలేదు. ఇటీవల తన ఇంటి ఎదురుగా ఉన్న చంద్రకు ఫోన్‌చేస్తున్నా ఆమె స్పందించకపోవడంతో, ఎలాగైనా ఆమెను హత్య చేయాలనుకున్నాడు. గురువారం ఉదయం ఉద్యోగానికని ఇంటి నుంచి చంద్ర బయలుదేరింది. దీన్ని గమనించిన సోంబాబు ఆమె వద్దకు వచ్చి కత్తితో దాడికి దిగాడు. తప్పించుకునే క్రమంలో చంద్ర చేయికి కత్తి తగిలింది. అంతటితో వదలకుండా ఆమె తలపై దాడి చేశాడు. సమీపంలోనే ఉన్న చంద్ర భర్త మోహన్ పరుగున వచ్చి సోంబాబును నిలువరించేందుకు ప్రయత్నించగా అతనిపై కూడా కత్తితో దాడి చేశాడు. భార్యాభర్తలిరువురి చేతులకు, తలకు తీవ్రగాయాలవడంతో స్థానిక పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స నిర్వహించి, అనకాపల్లి వంద పడకల ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సిఫార్సు మేరకు విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. ప్రస్తుతం చంద్ర కేజీహెచ్‌లో అపస్మారక స్థితిలో ఉంది. భర్త మోహన్ పరిస్థితి అదుపులో ఉంది.

పట్టాలపై శవమై..

దాడికి పాల్పడిన సోంబాబు సంఘటనా స్థలం నుంచి పరారవడంతో పోలీసులు అతని కోసం గాలింపు చర్యలు చేపట్టారు. అతని ఫోన్‌కు పలుమార్లు రింగ్ చేసినా స్పందన లేదు. అదే సమయంలో యలమంచిలి మండలం తురంగలపాలెం రైల్వే ట్రాక్‌పై పడి వ్యక్తి మృతి చెందిన విషయాన్ని గుర్తించిన కొంతమంది యలమంచిలి పోలీసులకు సమాచారం ఇచ్చారు. చూచుకొండ నుంచి పరారైన సోంబాబు మృతదేహంగా నిర్ధారించుకున్నారు. మునగపాక పోలీసులు యలమంచిలి పోలీసుల సహకారంతో రైల్వే పోలీసులకు ఘటనకు సంబంధించిన వివరాలు అందించారు. మృతుడు సోంబాబుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

రైతులకు మెరుగైన పరిహారం

- జాయింట్ కలెక్టర్ హామీ



జేసీకి వినతి పత్రం ఇస్తున్న రైతులు

నక్కపల్లి: విశాఖ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ నిర్మాణంలో భాగంగా జాతీయరహదారి నుంచి కాగిత, వేంపాడు, రెవెన్యూ గ్రామాల మీదుగా రోడ్డు నిర్మాణం కోసం భూములు ఇచ్చిన రైతులకు ఎకరాకు రూ.60 లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లిస్తామని జాయింట్ కలెక్టర్ జాహ్నవి హామీ ఇచ్చినట్లు కాగిత సర్పంచ్ పోతంశెట్టి రాజేష్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ సూరాకాసుల గోవిందు తదితరులు తెలిపారు. గురువారం అనకాపల్లి కలెక్టర్ కార్యాలయంలో రైతులకు జేసీ సమావేశం ఏర్పాటు చేశారన్నారు. ఈ సమావేశానికి కాగిత, వేంపాడు, అమలాపురం, తదితర గ్రామాలకు చెందిన రైతులు హాజరయ్యామన్నారు. జాతీయరహదారి నుంచి కాగిత మీదుగా ఇండస్ట్రియల్ కారిడార్ కోసం సేకరించిన చందనాడ భూముల వరకు కనెక్టవిటీ రోడ్డు నిర్మించేందుకు ఏపీఐఐసీ వారు నిర్ణయించారన్నారు. దీనికోసం భూములు అవసరమవుతాయన్నారు. అయితే కాగిత జాతీయరహదారిని ఆనుకుని ఉండటం వల్ల ఈ ప్రాంతంలో భూముల ధరలు చాలా ఎక్కువగా ఉన్నాయి. దీంతో ప్రభుత్వానికి, రైతులకు మధ్య ధర విషయంలో చాలా రోజుల నుంచి ప్రతిష్టంభన నెలకొంది. అయితే కాగిత రెవెన్యూ పరిధిలో సేకరించే భూములకు ఎకరాకు రూ.60 లక్షలు, వేంపాడు రెవెన్యూ పరిధిలో భూములకు ఎకరాకు రూ.46 లక్షలు చెల్లించేందుకు జేసీ అంగీకరించారన్నారు. రైతులు ఆమోదం తెలిపితే సేకరించే భూములకు నష్టపరిహారం త్వరలోనే వారి ఖాతాల్లో జమ చేయడం జరుగుతుందని హామీ ఇచ్చారన్నారు. మరోసారి రోడ్డు నిర్మాణం కోసం భూములు కోల్పోతున్న రైతులందరితో చర్చించి తమ ఆమోదం అధికారులకు తెలియజేయడం జరుగుతుందని వారు చెప్పారు. ఇవే భూములపై ఆధారపడి జీవిస్తున్న రైతులకు మెరుగైన నష్టపరిహారం తోపాటు, ప్యాకేజీ పునరావాసం కూడా కల్పించాలని రైతులంతా కలిసి జేసీకి వినతి పత్రం ఇవ్వడం జరిగిందని వారు తెలిపారు. జేసీతో జరిగిన సమావేశంలో అమలాపురం సర్పంచ్ పెదపూడి శంకర్రావు, ఉప సర్పంచ్ గంటా నర్సింగరావు, కాగిత ఉపసర్పంచ్ కృష్ణ, పలువురు రైతులు పాల్గొన్నారు.

గోవాడ సుగర్స్ కార్మికుల ఆందోళన

- ఎండీ కార్యాలయం ఎదుట ధర్నా



గోవాడ సుగర్ ఫ్యాక్టరీ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

చోడవరం: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గోవాడ సుగర్ ఫ్యాక్టరీ కార్మికులు గురువారం ఆందోళన చేశారు. ఫ్యాక్టరీ ఆవరణలో కార్మికులంతా నిరసన తెలిపి, ఎండీ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. కార్మికులకు రావలసిన జీతభత్యాలు వెంటనే చెల్లించాలని గుర్తింపు యూనియన్ అధ్యక్షుడు కేవీవీ భాస్కరరావు డిమాండ్ చేశారు. రెండేళ్లుగా కార్మికులకు రావలసిన ఓటీ డబ్బులు ఇవ్వలేదని, ఫ్యాక్టరీలో క్యాంటీన్‌ను పునఃప్రారంభించాలని డిమాండ్ చేశారు. గడిచిన ఆరు నెలలుగా రీ కాల్ లేక కార్మికుల జీవనం దుర్భరంగా ఉందన్నారు. దీనిపై ఎండీ సన్యాసినాయుడు సానుకూలంగా స్పందించడంతో కార్మికులు ఆందోళన విరమించారు. ఈ ఆందోళనలో కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్రమాదకర స్థాయికి చేరువలో రైవాడ



కనుచూపు మేర వరదనీటితో రైవాడ జలాశయం

- 112.50 మీటర్లకు చేరుకున్న నీటిమట్టం

దేవరాపల్లి : రైవాడ జలాశయం నీటిమట్టం ప్రమాదకర స్థాయికి చేరువలో ఉంది. జలాశయం గరిష్ట నీటిమట్టం 114 మీటర్లు కాగా, ప్రస్తుతం 112.50 మీటర్లకు చేరుకుంది. కాగా జలాశయంలోకి 200 క్యూసెక్కుల మేర వరద నీరు వచ్చి చేరుతుంది. ప్రమాదకర స్థాయి నీటిమట్టం 113.50 మీటర్లకు కేవలం ఒక్క మీటరు మాత్రమే దూరం ఉండడంతో ఇరిగేషన్ డీఈఈ జి.సత్యంనాయుడు తదితర ఇంజినీరింగ్ అధికారులు అప్రమత్తమయ్యారు. తుఫాన్ ప్రభావంతో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు సూచించడంతో ఇరిగేషన్ అధికారులు జలాశయంలోకి వచ్చే ఇన్‌ఫ్లోను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. 113.50 మీటర్లకు నీటిమట్టం చేరుకుంటే స్పిల్వే గేట్లు ద్వారా శారదానదిలోకి వరదనీటిని విడుదల చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. శారదానది పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

క్లుప్తంగా

సదరం శిబిరంలో 72 మంది అర్హుల గుర్తింపు



సదరం క్యాంపు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

అనకాపల్లి: స్థానిక ఎన్టీఆర్ క్రీడా మైదానంలో ఎన్టీఆర్ వైద్యాలయం ఆధ్వర్యంలో గురువారం కశింకోట, యలమంచిలి మండలాలకు చెందిన దివ్యాంగుల కోసం సదరం క్యాంపు నిర్వహించినట్టు వైద్యాలయం సూపరింటెండెంట్ ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్ కోసం 72 మందిని అర్హులుగా గుర్తించామన్నారు. శుక్రవారం కోటవురట్ల, నక్కపల్లి మండలాలకు చెందిన దివ్యాంగుల కోసం సదరం క్యాంపు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యుడు గంగాధర్, దివ్యాంగులు పాల్గొన్నారు.

సింహాచలం ఈవోగా త్రినాథరావు



సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి దేవస్థానం ఈవోగా దేవదాయ శాఖ సంయుక్త కమిషనర్ వి.త్రినాథరావు నియమితులయ్యారు. పశ్చిమగోదావరి జిల్లా ద్వారకా తిరుమల దేవస్థానం ఈవోగా విధులు నిర్వర్తిస్తున్న త్రినాథరావును ఇక్కడకు బదిలీ చేస్తూ ఆ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎస్.సత్యనారాయణ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా త్రినాథరావు సింహాచలం దేవస్థానం ఈవోగా రావడం ఇది నాల్గోసారి. గతంలో ఆయన మూడుసార్లు ఈవోగా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వర్తించారు. అన్నవరం దేవస్థానం ఈవోగా ఉంటూనే 2020 సెప్టెంబర్ 2 నుంచి 2021 జనవరి 22 వరకు, ద్వారకా తిరుమల ఈవోగా పని చేస్తూ 2022 సెప్టెంబర్ 22 నుంచి 2023 జూన్ 10 వరకు, 2023 జూన్ 26 నుంచి సెప్టెంబర్ 16 వరకు ఇక్కడ పనిచేశారు. ఇప్పుడు బదిలీపై పూర్తిస్థాయి ఈవోగా వస్తున్నారు. గతంలో ఆయన దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్‌గా, డిప్యూటీ కమిషనర్‌గా విశాఖలో విధులు నిర్వర్తించారు.

ప్రాజెక్టు అసిస్టెంట్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

ఎంవీపీకాలనీ(విశాఖ): జిల్లా మహిళా శిశు సంక్షేమం, సాధికారత శాఖ కార్యాలయంలో సక్షం అంగన్‌వాడీ, పోషణ్ 2.0 జిల్లా ప్రాజెక్టు అసిస్టెంట్ పోస్ట్ భర్తీకి ఆ సంస్థ కార్యాలయం నోటిఫికేషన్ విడుదల చేసింది. కాంట్రాక్ట్ పద్ధతిలో ఈ పోస్ట్ భర్తీ చేయనున్నారు. అర్హత, ఆసక్తి ఉన్న వారు ఈ నెల 30లోపు ఎంవీపీ కాలనీలోని సంస్థ కార్యాలయంలో దరఖాస్తు అందజేయాలి. https://visakhapatnam.ap.gov.in/ నుంచి దరఖాస్తు పొందవచ్చు.

అప్పు చేసి.. హాస్టల్ బువ్వ

- ఎస్సీ హాస్టళ్లకు బిల్లులు మంజూరు చేయని ప్రభుత్వం
- ఆరు నెలలుగా అప్పులు చేసి నిర్వహణ
- బిల్లుల మంజూరు కోసం వార్డెన్ల ఎదురుచూపులు



వసతి గృహంలో భోజనాలు చేస్తున్న విద్యార్థులు

కె.కోటపాడు : ఇది వరకు అప్పు చేసి పప్పు కూడు తినేవారేమో.. ఇప్పుడు హాస్టల్ భోజనం పెట్టడానికి కూడా అప్పులు చేయాల్సి వస్తోంది. ఆరు నెలలుగా బిల్లులు మంజూరు కాకపోవడంతో కొందరు వార్డెన్లకు అప్పు కూడా దొరకని పరిస్థితి ఉంది. అనకాపల్లి జిల్లాలో సాంఘిక సంక్షేమ శాఖ నిర్వహిస్తున్న బాలుర, బాలికల వసతిగృహాలకు సంబంధించి నిర్వహణ బిల్లులు ఆరు నెలలుగా మంజూరు కాలేదు. దీంతో మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాలతో పాటు పౌష్టికాహారం అందించేందుకు అప్పులు చేసి మరీ వసతిగృహాల అధికారులు నిర్వహణ సాగిస్తున్నారు. ప్రతి నెలా అప్పులు మీద అప్పులు చేయాల్సిన దుస్థితి నెలకొంది.

జిల్లాలో 32 హాస్టళ్లలో 3167 మంది ఆశ్రయం

అనకాపల్లి జిల్లాలో సాంఘిక సంక్షేమ శాఖకు చెందిన 32 వసతి గృహాలు ఉన్నాయి. వీటిల్లో ఈ ఏడాది 3,167 మంది విద్యార్థులు చదువుతున్నారు. అచ్యుతాపురం, ఎ.కోడూరులలో బాలుర, కశింకోటలో బాలికల సమీకృత వసతి గృహాలు సాగుతున్నాయి. వీటితో పాటు పరవాడ, సబ్బవరం, పాయకరావుపేట, కె.కోటపాడు, యలమంచిలి, చోడవరం, నాతవరం, కోటవురట్ల, రావికమతం, పాయకరావుపేట-1, దార్లపూడి, నర్సీపట్నం 1, 2, నక్కపల్లిలలో బాలికల హాస్టళ్లు నిర్వహణలో ఉన్నాయి. బాలుర వసతిగృహాలు జిల్లాలో వాడచీపురుపల్లి, అనకాపల్లి, చోడవరం, యలమంచిలి, నాతవరం, సమ్మచింత, వడ్డాది, పాయకరావుపేట-1, 2, నక్కపల్లి, నర్సీపట్నం(ఆనందనిలయం), నర్సీపట్నం, కొత్తకోట, గొలుగొండ, కోమళ్ళపూడిలలో సాగుతున్నాయి.

రూ.2 లక్షల వరకు అప్పు

ఈ ఏడాది జనవరి వరకూ గత ప్రభుత్వ కాలంలో బిల్లులు మంజూరయ్యాయి. ఫిబ్రవరి నెల నుంచి ఇప్పటి వరకూ ఒక్క రూపాయి కూడా బిల్లులు మంజూరు కాలేదు. సాధారణ వసతిగృహంలో ఒక్కో విద్యార్థికి ప్రభుత్వం రోజుకి రూ.46, కళాశాల వసతి గృహాల్లో ఒక్కో విద్యార్థికి భోజన ఖర్చులకు రూ.53 చెల్లిస్తుంది. ఈ కేటాయింపులతో నెలకు సాధారణ వసతిగృహంలో ఒక్కో విద్యార్థికి రూ.1400, కళాశాల విద్యార్థికి రూ.1600 చెల్లిస్తుంది. మెనూ ప్రకారం వారానికి మూడు రోజులు చికెన్‌తో కూడిన భోజనం, వారానికి ఆరు కోడి గుడ్లు, ప్రతి ఆదివారం బిరియాని, అరటి పండ్లు, పాలు, కూరగాయలతో కూడిన ఆహారం అందించాల్సి ఉంది. ప్రతి నెలా నిర్వహణ బిల్లులు మంజూరు కాకపోవడంతో హాస్టళ్ల నిర్వహణకు ఒక్కో వార్డెన్ సుమారు రూ.2 లక్షలకు పైగా అప్పు తెచ్చి నిర్వహణ సాగిస్తున్నట్లు సమాచారం.

కానరాని నిర్వహణ నిధులు



ఎ.కోడూరు సాంఘిక సంక్షేమ శాఖ సమీకృత బాలుర వసతి గృహం



వసతిగృహంలో విద్యార్థులు

వసతి గృహాల నిర్వహణ నిధులను ప్రభుత్వం మంజూరు చేయడం లేదు. దీంతో విద్యుత్ బల్బులు, మరుగు, మూత్రశాలల నిర్వహణ, చిన్నపాటి కిటికీలు, తలుపులకు మరమ్మతు పనులకు సొంత సొమ్మును వార్డెన్లు వెచ్చించాల్సి వస్తోంది. హాస్టల్ నిర్వహణకు ప్రతి నెలా కనీసం రూ.3 వేలు నుంచి రూ.5వేల వరకూ ఖర్చు పెట్టాల్సి వస్తున్నట్టు వార్డెన్లు చెబుతున్నారు.

బిల్లుల మంజూరుకు కృషి

ఎస్సీ వసతి గృహాల నిర్వహణకు సంబంధించి ఆరు నెలల బిల్లులు చెల్లించాల్సి ఉంది. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. మరో మారు బిల్లుల చెల్లింపుల విషయాన్ని వివరించి, నిధులు మంజూరయ్యేందుకు కృషి చేస్తా.

– బి.ఈశ్వరరావు, ఏఎస్‌డబ్ల్యూవో, చోడవరం

ఫార్మా కార్మికులకు భద్రత కల్పించాలి



స్థానిక పూడిమడక జాతీయ రహదారిలో కార్మికులతో మాట్లాడుతున్న లోకనాథం, ఆర్.శంకరరావు

- సీపీఎం నేతల డిమాండ్
- పూడిమడకకు చేరుకున్న రక్షణ యాత్ర

అనకాపల్లి: ఫార్మా, సెజ్ కంపెనీల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు, కార్మికులకు భద్రత కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రుత్తల శంకరరావు డిమాండ్ చేశారు. జిల్లాలో ఫార్మా, సెజ్ కంపెనీల్లో భద్రత సౌకర్యాలు కల్పించి, కార్మికులు, ఉద్యోగుల ప్రాణాలను కావాడాలని ఈ నెల 16న పాయకరావుపేటలో తలపెట్టిన రక్షణ యాత్ర(బైక్) గురువారం జాతీయ రహదారి పూడిమడక జంక్షన్ వద్దకు చేరుకుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఫార్మా కంపెనీలు ఉన్న ప్రాంతంలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, స్పెషల్ బర్న్ వార్డులు ఏర్పాటు చేయాలన్నారు. కంపెనీలు ఏర్పాటు చేసే సమయంలో స్థానికులకు 75శాతం ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి, తరువాత అమలు చేయడం లేదన్నారు. ఈ యాత్ర శుక్రవారం సాయంత్రం 4 గంటలకు అచ్యుతాపురం మెయిన్ రోడ్డుకు చేరుకుంటుందని, అక్కడ భారీ బహిరంగ సభ జరుగుతుందన్నారు. రక్షణ యాత్ర పూడిమడక జాతీయ రహదారి నుంచి నెహ్రూచౌక్, చిన్ననాలుగు రోడ్ల జంక్షన్ నూకాంబిక అమ్మవారి ఆలయ రహదారి మీదుగా మునగపాక మండలం తోటాడ గ్రామానికి చేరుకుంది. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి సభ్యుడు జి.కోటేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు ఎ.రాజు, గంటా శ్రీరామ్, కె.తేలయ్య బాబు, బి.ఉమామహేశ్వరరావు, బి.నూక అప్పారావు, మామిడి రమణ, శివాజీ, డి.డి.వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

కనీస పెన్షన్ రూ.5 వేలుకు పెంచాలి



ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఈపీఎస్-95 పెన్షన్‌దారులు

అనకాపల్లి: ఈపీఎస్-95 పెన్షన్‌దారులకు కనీస పెన్షన్ రూ.5వేలుకు పెంచాలని భారతీయ మజ్దూర్ సంఘ్ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు గోకువాడ శ్రీరాములు డిమాండ్ చేశారు. స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద భారతీయ మజ్దూర్ సంఘ్, జిల్లా ఈపీఎస్-95 పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ధర్నా చేశారు. అనంతరం ఆర్డీవో ఎ.జె.చిన్నకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా వైద్య సౌకర్యం కల్పించాలన్నారు. దేశవ్యాప్తంగా కనీస పెన్షన్ పొందుతున్న 78 లక్షల మంది ఉన్నారన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా కనీస పెన్షన్ రూ.5 వేలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా కన్వీనర్ బొట్టా రమణ, సింహాద్రి, ఎన్టీపీసీ యూనియన్ ప్రధాన కార్యదర్శి కూండ్రపు సతీష్, పెన్షనర్స్ బురద తాత బాబు, గొర్లె నాగభూషణం, కుంచురాజు, తదితరులు పాల్గొన్నారు.

వేద పండితులకు నిరుద్యోగ భృతి

మహారాణిపేట: వేదాభ్యాసం పూర్తి చేసిన నిరుద్యోగ వేద పండితులకు నెలకు రూ.3వేల భృతి మంజూరుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ కె.శిరీష ఓ ప్రకటనలో తెలిపారు. అర్హులైన వేద పండితులు ఈ నెల 26లోగా సహాయ కమిషనర్(ఏసీ), దేవదాయ ధర్మాదాయ శాఖ, టర్నర్ చౌల్ట్రీ, విశాఖపట్నం చిరునామాకు దరఖాస్తులు అందజేయాలని సూచించారు. దరఖాస్తుతోపాటు ఆధార్ కార్డు, విద్యార్హతలు, ప్రభుత్వం/ప్రైవేట్ రంగంలో ఉద్యోగం చేయడం లేదని స్వీయ ధ్రువీకరణపత్రం జత చేయాలని పేర్కొన్నారు.

కొత్త వైద్య కళాశాలల్లో సీట్లు భర్తీ చేయాలి



కృష్ణ కళాశాల వద్ద పీడీఎస్‌వో జిల్లా కమిటీ నిరసన

మద్దిలపాలెం: రాష్ట్రంలో రెండు కొత్త వైద్య కళాశాలల్లో ఈ విద్యా సంవత్సరానికి సీట్లు భర్తీ చేయాలని పీడీఎస్‌వో జిల్లా కార్యదర్శి వి.లక్ష్మి డిమాండ్ చేశారు. అలాగే పులివెందులలోని వైఎస్సార్ వైద్య కళాశాల అనుమతిని ఉపసంహరించుకోవాలని రాష్ట్ర మెడికల్ కమిషన్ డైరెక్టరేట్‌కు రాసిన లేఖను వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. రాష్ట్ర చర్యలను ఖండిస్తూ గురువారం మద్దిలపాలెంలోని వీఎస్ కృష్ణా ప్రభుత్వ కళాశాల వద్ద నిరసన చేపట్టారు. ఈ విద్యా సంవత్సరంలో జాతీయ మెడికల్ కమిషన్‌ను ఐదు కళాశాలలకు అనుమతి కోరగా రెండు కళాశాలలకు 50 సీట్లతో అడ్మిషన్లకు అనుమతి మంజూరు చేసిందన్నారు. పులివెందుల కళాశాలలో మౌలిక సదుపాయాలను కల్పించలేదని, ఈ విద్యా సంవత్సరంలో అడ్మిషన్లను చేపట్టలేమని రాష్ట్ర ప్రభుత్వం జాతీయ మెడికల్ కమిషన్‌కు లేఖ రాయడం సిగ్గుచేటని ఆమె విమర్శించారు. కార్యక్రమానికి పీడీఎస్‌ఓ సభ్యులు పాల్గొన్నారు.


పండగ వేళ ప్రత్యేక రైళ్లు



తాటిచెట్లపాలెం(విశాఖ): పండగల వేళ ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు.

- విశాఖపట్నం–షాలిమర్ (08508) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ అక్టోబర్ ఒకటి నుంచి నవంబరు 26వ తేదీ వరకు నడుస్తుంది. ఈ రైలు ప్రతీ మంగళవారం ఉదయం 11.20 గంటలకు విశాఖలో బయలుదేరుతుంది. షాలిమర్–విశాఖపట్నం (08507) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ అక్టోబరు 2 నుంచి నవంబరు 27వ తేదీ వరకు నడుస్తుంది. ఈ రైలు షాలిమర్‌లో ప్రతి బుధవారం తెల్లవారు 5 గంటలకు బయలుదేరి.. అదే రోజు రాత్రి 8.50 గంటలకు విశాఖ చేరుకుంటుంది.
- విశాఖపట్నం–అరకు (08525) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ప్రతిరోజూ విశాఖపట్నంలో ఉదయం 8.30 గంటలకు బయలుదేరి 11.30 గంటలకు అరకు చేరుకుంటుంది. అరకు–విశాఖపట్నం(08526) స్పెషల్ అరకులో మధ్యాహ్నం 2 గంటలకు బయలుదేరి రాత్రి 6 గంటలకు విశాఖ చేరుకుంటుంది. ఈ రైలు అక్టోబరు 5 నుంచి 15వ తేదీ వరకు నడుస్తుంది.

అప్పన్న అన్నప్రసాదానికి రూ.5 లక్షల విరాళం



దాతకు బాండ్ అందిస్తున్న సూపరింటెండెంట్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి రూ.5 లక్షల విరాళాన్ని నలుగురు దాతలు గురువారం అందించారు. తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌లోని బంజారా హిల్స్ ప్రాంతానికి చెందిన బూరుగుపల్లి శివ రామకృష్ణ ప్రసాద్, రాజమండ్రికి చెందిన బూరుగుపల్లి నితీష్ కృష్ణ, బూరుగుపల్లి తిమ్మరాజు, బూరుగుపల్లి వెంకట్ తిమ్మరాజు రూ.1.25 లక్షలు చొప్పున మొత్తం రూ.5 లక్షల విరాళాన్ని నగదు రూపంలో అందజేశారు. దేవస్థానం తరపున దాతలకు అన్నప్రసాద పథకం బాండ్‌ని సూపరింటెండెంట్ సిరిపురపు కనకరాజు అందించారు. అధికారులు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు. దేవస్థానం ఉద్యోగి సూర్యనారాయణ పాల్గొన్నారు.

కేజీహెచ్ సీఎస్సార్‌ఎంవోగా డాక్టర్ మోహర్ కుమార్



మహారాణిపేట(విశాఖ): కేజీహెచ్ సివిల్ సర్జన్ రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ (సీఎస్సార్‌ఎంవో)గా డాక్టర్ మోహర్ కుమార్ గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. గత 14 ఏళ్లుగా ఈ పోస్టు ఖాళీగా ఉంది. డాక్టర్ మోహర్ కుమార్ ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రిలో డిప్యూటీ సూపరింటెండెంట్‌గా ఇప్పటివరకు విధులు నిర్వర్తించారు. ఈ సందర్భంగా కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్‌ను ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు.

గురజాడ అడుగుజాడ ఎక్కడ?

- జన్మస్థలంలో తగినంత గుర్తింపు రాని వైనం
- మ్యూజియం నిర్మించాలని అభిమానుల కోరిక



గురజాడ కాంస్య విగ్రహం

ఎస్.రాయవరం: దేశమంటే మట్టికాదోయ్ దేశమంటే మనుషులోయ్ అని చెప్పిన మహాకవి గురజాడ వెంకట అప్పారావు రచనలు ఎప్పటికీ నిలిచిపోతాయి. ఆయన కీర్తి అజరామరం. గురజాడ అడుగుజాడ సాహితీవేత్తలకు మార్గదర్శకం. దేశమంతటా ఆయనకు అంత గుర్తింపు ఉన్నా ఆయన జీవించిన ఊరిలో మాత్రం తగినంత ఆదరణ లభించలేదు. గురజాడ ఎస్.రాయవరంలో జన్మించిన విషయం తెలిసిందే. ఇది ఆయన అమ్మమ్మగారి ఊరు. ఆయన జీవించిన ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలన్న ఆశయంతో 1981లో ఇక్కడ 9మంది సభ్యులతో గురజాడ ఫౌండేషన్ ఏర్పాటైంది. అప్పటి నుంచి జయంతి, వర్ధంతి వేడుకలను సొంత సొమ్ముతో నిర్వహిస్తూ వచ్చారు. ప్రభుత్వం అధికారికంగా జన్మస్థలంలో వేడుకలు నిర్వహించాలన్న వినతులు కార్యరూపం దాల్చలేదు. గురజాడ స్మారకంగా కళా మందిరాలు, మ్యూజియంలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఆ మహాకవి జయంతిని పురస్కరించుకుని శుక్ర, శని వారాల్లో మండల కేంద్రంలో అనేక కార్యక్రమాలు ఏర్పాట్లు చేస్తున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు బొలిశెట్టి గోవిందరావు బజారు కూడలిలో గత ఏడాది కాంస్య విగ్రహం ఏర్పాటు చేశారు. గురజాడ జయంతి సందర్భంగా ఆ విగ్రహానికి రంగు వేసి మరింత అందంగా ముస్తాబు చేశారు.

మ్యూజియం ఏర్పాటు చేయాలి



గురజాడ జన్మస్థలమయిన ఎస్.రాయవరం మండలానికి గురజాడ పేరు పెట్టాలి. ఇక్కడ కాంస్య విగ్రహం ఏర్పాటు చేశాం. ప్రభుత్వం సహకరిస్తే మరిన్ని మంచి కార్యక్రమాలు చేపడతాము. జన్మస్థలం కేవలం జయంతులు, వర్ధంతులకే పరిమితం అవుతోంది. గురజాడ పుట్టిన ఇంటిలో మ్యూజియం నిర్మాణం చేసి ఆయన గుర్తులు ప్రదర్శనలో ఉంచాలని భావిస్తున్నాము.

–బొలిశెట్టి గోవిందరావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, ఎస్.రాయవరం

అధికారికంగా నిర్వహించాలి



గురజాడ ఫౌండేషన్ ఏర్పాటు చేసి 43 సంవత్సరాలు అయ్యింది. అప్పటి నుంచి గురజాడ ఆశయాలకు అనుగుణంగా పలు సాంస్కృతిక , అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించారు. గురజాడ పేరున ఏర్పాటు చేసిన కళా మందిరాన్ని పంచాయతీ నిర్వాహణకు కేటాయించాము. మండలంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలి. ప్రభుత్వం సహకరించాలి.

– కర్రి వెంకటేశ్వరరావు, గురజాడ ఫౌండేషన్,, ఎస్.రాయవరం

షిఫ్ట్ ఆపరేటర్ పోస్ట్ మాకే ఇవ్వాలి

- గతంలో పని చేసిన ఆపరేటర్ గుండెపోటుతో మృతి
- రాజాం సబ్‌స్టేషన్ ఎదుట బాధిత కుటుంబం ధర్నా
- ఉద్యోగం ఇస్తామని చెప్పి ఎమ్మెల్యే మోసగించడంపై ఆగ్రహం



రాజాం సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న బాధితురాలు రామలక్ష్మికి మద్దతుగా నిలిచిన గ్రామస్తులు

బుచ్చెయ్యపేట: రాజాం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో షిఫ్ట్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తూ మృతిచెందిన రొంగలి నరసింగరావు కుటుంబం గురువారం ధర్నాకు దిగింది. బుచ్చెయ్యపేట మండలం రాజాం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో తొమ్మిదేళ్లుగా షిఫ్ట్ ఆపరేటర్‌గా రొంగలి నరసింగరావు విధులు నిర్వహిస్తూ ఈ ఏడాది ఫిబ్రవరి 17న గుండెపోటుతో మృతి చెందారు. ఆర్.భీమవరానికి ఈయన ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజుకి విధేయుడిగా ఉండేవాడు. మృతి చెందిన రోజు ఎమ్మెల్యే.. మండల టీడీపీ నాయకులతో కలిసి నరసింగరావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. షిఫ్ట్ ఆపరేటర్ ఉద్యోగం మళ్లీ మీ కుటుంబ సభ్యులకే వచ్చేలా చేస్తానని అప్పట్లో ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆ పోస్టు కోసం ఎమ్మెల్యే, విద్యుత్ శాఖ అధికారుల చుట్టూ మృతుడి భార్య రామలక్ష్మి తిరుగుతోంది. ఈ నేపథ్యంలో ఈ పోస్టును ఎమ్మెల్సీ చిరంజీవి స్వగ్రామం రావికమతం మండలం దొండపూడికి చెందిన వ్యక్తికి ఇవ్వడంతో ఆయన బుధవారం విధుల్లో చేరారు. ఈ విషయం తెలుసుకున్న బాధితురాలు రామలక్ష్మి సబ్‌స్టేషన్ ఎదుట గురువారం ధర్నాకు దిగింది. తమకే ఇస్తామన్న పోస్టును మరో మండలానికి చెందిన వ్యక్తికి ఎలా ఇస్తారని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. రామలక్ష్మికి మద్దతుగా ఆర్.భీమవరం, నీలకంఠాపురం మాజీ సర్పంచ్‌లు బుజ్జి, సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ వెలంకాయల అప్పలనాయుడు, నాయకుడు సతీష్‌తో పాటు టీడీపీ, వైఎస్సార్‌సీపీ నాయకులు అండగా నిలిచారు.

విద్యుత్ వినియోగంలో అవగాహన అవసరం



గైరంపేటలో రైతులకు కరపత్రాలు అందిస్తున్న ఈపీడీసీఎల్ చీఫ్ విజిలెన్స్ అధికారి కింజరాపు రామకృష్ణప్రసాద్, మండల ఏఈ పద్మనాభం

రోలుగుంట: విద్యుత్ వినియోగంలో రైతులు, ప్రజలకు అవగాహన అవసరమని ఏపీ ఈపీడీసీఎల్ చీఫ్ విజిలెన్స్ అధికారి కింజరాపు రామకృష్ణప్రసాద్ తెలిపారు. ఎం.కె.పట్నం శివారు పెదపేట పామాయిల్ తోటలో కొమ్మలు కోస్తుండగా విద్యుదాఘాతానికి గురై గురువారం గొలుగొండ మండలం గైరంపేటకు చెందిన కూలీ ఊట వెంకటరమణ(48) మృతి చెందిన విషయం విదితమే. ఈ మేరకు శుక్రవారం విజిలెన్స్ అధికారి రామకృష్ణప్రసాద్ శుక్రవారం రోలుగుంట వచ్చి మండల ఏఈ పద్మనాభంతో కలిసి గైరంపేట వెళ్లారు. రైతులు, ప్రజలను కలిశారు. విద్యుత్ ప్రమాదాలపై అవగాహన కల్పించారు. కాళ్లకు చెప్పులు లేకుండా, తడి చేతులతో పొలంలో మోటారును ఆన్, ఆఫ్ చేయడం చాలా ప్రమాదమన్నారు. పొలాల్లో తెగిపడిన వైర్లను తాకరాదన్నారు. వర్షా కాలంలో విద్యుత్ స్తంభాలను తాకొద్దని చెప్పారు. రైతులకు జాగ్రత్తలు, నివారణ చర్యలకు సంబంధించిన కరపత్రాలు అందజేశారు.

యువతే దేశ భవిష్యత్.. మత్తుకు బానిస కావొద్దు

కేంద్ర మంత్రి వీరేంద్రకుమార్



గ్రీన్ వ్యాలీలో మంత్రి వీరేంద్రకుమార్

మధురవాడ(విశాఖ): దేశ భవిష్యత్తు, శక్తి యువతేనని కేంద్ర సామాజిక న్యాయం, సాధికార శాఖ మంత్రి డాక్టర్ వీరేంద్రకుమార్ అన్నారు. ఏపీ–ఎస్ఎల్‌సీఏల సందర్శనలో భాగంగా మిథిలాపురి వుడా కాలనీలోని గ్రీన్ వ్యాలీ ఫౌండేషన్‌ను గురువారం ఆయన సందర్శించారు. ఇక్కడ వ్యసన విమోచనలో చికిత్స పొందుతున్న యువత, ఇతర రోగులతో ఆయన మాట్లాడారు. ఇక్కడ చికిత్స తీసుకుని.. వ్యసనాల బారి నుంచి విముక్తి పొంది.. ఇక్కడే పనిచేస్తున్న వారిని పలకరించారు. గ్రీన్ వ్యాలీ ఫౌండేషన్ నిర్వాహకురాలు ఉమా రాజ్‌ను అభినందించిన ఆయన.. చికిత్స తీసుకుంటున్న యువతనుద్దేశించి మాట్లాడారు. యువత వ్యసనాలు, మత్తుకు బానిసలు కాకూడదన్నారు. నషా ముక్తి భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మత్తు నుంచి విముక్తి కలిగించడానికి ఎన్‌జీవోలు, బ్రహ్మ కుమారీస్, పండిట్ రవిశంకర్ తదితర సంస్థలతో ఎంవోయూలు చేసుకుంటున్నట్టు చెప్పారు. కొన్ని సంస్థలకు ఆర్థిక సహాయం కూడా అందిస్తున్నట్టు వెల్లడించారు. అనంతరం సిబ్బంది, ఇక్కడ చికిత్స పొందుతున్న వారు కేంద్రమంత్రిని సత్కరించారు. జేసీ మయూర్ అశోక్, తహసీల్దార్ పాల్‌కిరణ్ పాల్గొన్నారు.

హెటెరో బస్సును ఢీకొట్టిన లారీ



రేగుపాలెం హైవే కూడలి వద్ద ప్రమాదానికి గురైన బస్సు



బస్సును ఢీకొట్టిన లారీ

యలమంచిలి రూరల్: నక్కపల్లి హెటెరో డ్రగ్స్ పరిశ్రమ నుంచి ఉద్యోగులతో యలమంచిలి వస్తున్న బస్సును రేగుపాలెం హైవే కూడలి వద్ద గురువారం రాత్రి వెనక నుంచి ఓ లారీ ఢీకొట్టింది. రేగుపాలెం కూడలి వద్ద బస్సు పాత జాతీయ రహదారి వైపునకు వెళుతుండగా.. అనకాపల్లి నుంచి తుని వైపు వెళ్తున్న లారీ వెనక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెనక సీట్లలో కూర్చున్న ముగ్గురు ఉద్యోగులు గాయపడ్డారు.

వారిని యలమంచిలి సామాజిక ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించినట్టు యలమంచిలి రూరల్ ఎస్‌ఐ ఉపేంద్ర తెలిపారు.

క్లుప్తంగా

వినాయక లడ్డూ వేలం



లడ్డూ దక్కించుకున్న రిషిక్ శ్రీకార్తికేయన్‌కు అందజేస్తున్న కమిటీ సభ్యులు

అనకాపల్లి: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా అక్కిరెడ్డిపాలెం పంచాయతీ తారక రామారావు కాలనీ రామాలయం ఆలయంలో గురువారం స్వామివారి లడ్డూ వేలం వేశారు. దీన్ని పూసర్ల అనురాధ దంపతులు రూ.3,500లకు దక్కించుకుని అక్కడ భక్తులకు పంపిణీ చేశారు. తొలుత స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని రామాలయం ప్రతినిధి సాలాపు దేముళ్లనాయుడు, కమిటీ సభ్యులు ప్రారంభించారు. సాయంత్రం 5 గంటలకు స్వామివారిని పురవీధుల్లో యువత, కాలనీ వాసులు ఊరేగించారు. జాతీయ రహదారి కొప్పాక ఏలేరు కాలువలో నిమజ్జనం చేశారు.

టాస్క్‌ఫోర్స్ బృందం తనిఖీ



వెల్‌నెస్ సెంటర్ ఉద్యోగులతో టాస్క్‌ఫోర్స్ కన్వీనర్ లూసి

అనకాపల్లి: ఏఎంఏఎల్ కళాశాల కొత్తూరు-2లో రామాపురం హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌ను జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యులు శుక్రవారం పరిశీలించారు. ఆస్పత్రిలో రోగులకు అందుతున్న సేవలు, గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు వైద్య సేవలు అందించాలని బృందం సభ్యులు సెంటర్ ఎంఎల్‌పీహెచ్ వైద్య సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. టాస్క్‌ఫోర్స్ బృందం జిల్లా ప్రోగ్రాం కన్వీనర్ డాక్టర్ లూసీ, డీపీఎంవో జగదీష్, ఎస్‌వో రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

అన్నా క్యాంటీన్ ప్రారంభం

అనకాపల్లి: స్థానిక ఎన్టీఆర్ ఆస్పత్రి ఆవరణ, రైల్వే స్టేషన్ సమీపంలో గురువారం రాత్రి అన్నా క్యాంటీన్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ రోగులకు, ప్రయాణికులకు ఇవి ఎంతో ఉపయోగపడతాయన్నారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగ జగదీశ్వరరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపరెడ్డి పరమేశ్వరరావు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు గురువారం 184 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,500	4,950
రెండో రకం	3,610	4,150
మూడోరకం	3,000	3,330

అనకాపల్లి సినిమాలు

గొర్రె పురాణం	:రాజా
ఏఆర్ఎం 3డీ	:సత్యనారాయణ స్క్రీన్-1
మత్తు వదలరా 2	: సత్యనారాయణ స్క్రీన్-2
ఆయ్	: పర్లిసాయి
సరిపోదా శనివారం	: షిర్డీసాయి
చిక్లెట్స్	:వెంకటేశ్వర
మన్యం ధీరుడు సీతారామరాజు	:శ్రీసత్య
హైడ్ ఎన్ సీక్	:రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 42 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-7 యూనిట్, బీ పాజిటివ్-22 యూనిట్లు, ఓ పాజిటివ్-8 యూనిట్లు, ఏబీ పాటిజివ్-5 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 385 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 349 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (08924223595)ని సంప్రదించవచ్చు.



తుమ్మపాలలో నీట మునిగిన వరి పొలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీరామ్మూర్తి, ఏవో రంగాచారి (ఫైల్)



దిబ్బపాలెంలో నీట మునిగిన పొలంలో రైతు (ఫైల్)

అన్నదాత అగచాట్లు

- తుపాను వర్షాలకు తీవ్రంగా నష్టం
- కూటమి ప్రభుత్వం నుంచి అందని సాయం
- ఆత్మహత్యే శరణ్యమంటున్న రైతులు
- అమలుకాని అన్నదాత సుఖీభవ పథకం

రైతులంటే సీఎం చంద్రబాబుకు ఎప్పుడూ చిన్నచూపే... గతంలోనే పలుమార్లు వ్యవసాయం దండగ అని విమర్శించి అధికారానికి దూరమయ్యారు. మళ్లీ ఇప్పుడు అదే వంకర బుద్ధి ప్రదర్శిస్తున్నారు. అధికారంలోకి వచ్చి మూడు మాసాలు దాటినా అన్నదాత సుఖీభవ అమలు చేయకపోగా, తాజాగా తుపాను వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకున్న పాపానపోలేదు.

అనకాపల్లి: కూటమి ప్రభుత్వంలో రైతులకు కన్నీళ్లు మిగులుతున్నాయి. 2024 సార్వత్రిక ఎన్నికల ముందు కూటమి నేతలు ఇంటింటికీ తిరిగి 'సూపర్ సిక్స్' పథకాలు అంటూ ఊదరగొట్టారు. వాటికి రైతులతో పాటు అన్ని వర్గాల ప్రజలు ఆశపడి గెలిపించారు.

ఇప్పుడు అధికారం చేపట్టి వంద రోజులు అవుతున్నప్పటికీ ఏ ఒక్క పథకమూ అమలు చేయలేదు. సరికదా దేశానికి అన్నపెట్టే వారిని ఆదుకోవడంలో పూర్తిగా విఫలమైంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతుల కోసం అమలు చేసిన రైతు భరోసా పథకం పేరు మార్చి 'అన్నదాత సుఖీభవ' పథకం కింద ఏడాదికి ఒక్కొక్క రైతుకు రూ.20 వేలు అందిస్తామని నమ్మబలికింది. ఇప్పుడు తొలి విడత పెట్టుబడిగా సాయం రూ.7 వేలు ఇవ్వకపోగా, అటు తుపాను వర్షాలకు నష్టపోయిన పంటకు పరిహారం చెల్లించలేదు. దాంతో రైతులకు ఏమి చేయాలో అర్థంకాక తలలు పట్టుకుని బాధపడుతున్నారు.

అప్పు చేసి సాగు పెట్టుబడులు

ఖరీఫ్ సీజన్‌లో అనకాపల్లి మండలంలో 5,600 ఎకరాల్లో వరినాట్లు వేశారు. రెండు సార్లు తుఫాన్, ఒక సారి భారీ వర్షాలు కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇప్పటికే తుఫాన్ కారణంగా మండలంలో 800 ఎకరాల్లో వరినాట్లు నీటిలో మునిగిపోవడంతో పాడైయ్యాయి. ఎకరానికి రూ. 35 వేల నుంచి 45 వేల వరకు ఖర్చు చేశారు. కూటమి ప్రభుత్వం 'అన్నదాన సుఖీభవ'లో భాగంగా రూ.20 వేలు ఇస్తామని ఎన్నికల హామీ ఇచ్చింది. ఖరీఫ్ ప్రారంభమై మూడు మాసాలు గడుస్తున్నా తొలి విడతగా రూ.7 వేలు ఇవ్వలేదు. దాంతో చాలావరకు అప్పులు చేసి పెట్టుబడులు పెట్టాల్సిన పరిస్థితి వచ్చిందని వాపోయారు. అదే సమయంలో కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ పథకానికి సంబంధించి తొలి విడత సాయంగా రూ.2 వేలు రైతుల ఖాతాల్లో జమ చేసింది.

వైఎస్సార్‌సీపీ పాలనలో రైతే రాజు....

గత వైఎస్సార్‌సీపీ పాలనలో ముందుగా పొలంలో భూసార పరీక్షలు చేసేవారు. ఏ పంట వేస్తే బాగుంటుందో వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు పలు సూచనలు ఇచ్చేవారు.

ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాయం అందించేవారు. పీఎం కిసాన్ రూ.6 వేలు, రైతు భరోసా రూ.7,500 కలిపి ఏటా రూ.13,500 చొప్పున మూడు విడతల్లో రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసేవారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో కష్టాలు తప్పడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రైతులపై చిన్నచూపు తగదు



తుమ్మపాలలో రెండున్నర ఎకరాలు కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాను. ఎకరా పంట తుఫాన్ వర్షాలకు నీట మునిగింది. వేసిన వరినాట్లు పూర్తిగా పాడైయ్యాయి. వ్యవసాయ శాఖ అధికారులు పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక పంపించారు. ఇప్పటికే రూ.60 వేలు అప్పు చేసి వరినాట్లు వేశాను. మొదటి దశలోనే నష్టం వచ్చింది. మరో తుఫాన్ వస్తుందని వాతావరణ శాఖ విభాగం అధికారులు చెబుతున్నారు. గుండెలో రైళ్లు పరుగెడుతున్నాయి. రైతులపై ప్రభుత్వం చిన్నచూపు చూడడం తగదు. ఇలాంటి పరిస్థితిలో వ్యవసాయం చేయాలంటే కష్టంగా ఉంది.

– గుంతల చిన్నరాజు, రైతు, తుమ్మపాల గ్రామం, అనకాపల్లి మండలం

రెండెకరాల పంట నీట మునిగింది



ఖరీఫ్ సీజన్‌లో రైతులు పెట్టుబడి పెట్టుకుని నేటి వరకూ కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేయలేదు. ఈ పథకాన్ని ఎప్పుడు అమలు చేస్తారో ప్రకటించాలి. ఇటీవల తుపాను వర్షాలకు వరినాట్లు నీట మునిగాయి. ఇతర పంటలకు నష్టం వాటిల్లింది. నేను నాలుగెకరాలు సాగు చేస్తున్నాను. రెండెకరాల పంట నీట మునిగింది. రైతులను ఆదుకోవాలి.

– ఎ.వెంకటరమణ, వెంకుపాలెం గ్రామం, అనకాపల్లి మండలం

గాజుల అలంకరణలో మరిడిమాంబ



గాజుల అలంకరణలో దర్శనమిస్తున్న మరిడిమాంబ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

అనకాపల్లి: స్థానిక గవరపాలెంలోని సత్తెమ్మతల్లి ఆలయ రహదారిలో మరిడిమాంబ నెల పండగను పురస్కరించుకుని గురువారం అమ్మవారిని గాజులతో అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం కమిటీ సభ్యులు క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ అధ్యక్షుడు బి.ఎస్.ఎం.కె.జోగినాయుడు మాట్లాడుతూ అమ్మవారి ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. కార్యక్రమంలో కమిటీ గౌరవాధ్యక్షుడు ఎల్లపు వెంకటరమణ, కార్యదర్శి కాండ్రేగుల హరికిషోర్, ఉపాధ్యక్షుడు కె.ఎం.నాయుడు, కోశాధికారి కాండ్రేగుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్డీఏ నాయకులు క్షమాపణ చెప్పాలి

ఎస్పీకి కాంగ్రెస్ పార్టీ నాయకుల ఫిర్యాదు



ఎస్పీ దీపికకు ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మీసాల సుబ్బన్న

అనకాపల్లి: రాహుల్‌గాంధీపై ఎన్డీఏ నాయకులు చేసిన అనుచిత వ్యాఖ్యలపై తక్షణమే క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మీసాల సుబ్బన్న డిమాండ్ చేశారు. స్థానిక ఎన్టీఆర్ బెల్లం మార్కెట్ యార్డులో మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేశారు. పార్టీ ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. అనంతరం ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ ఎం.దీపికకు ఎన్డీఏ ప్రభుత్వంపై ఫిర్యాదు చేశారు. రాహుల్ గాంధీకి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. దీనిపై ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్‌షా మౌనంగా ఉండడం చూస్తుంటే వీరి ప్రోద్బలంతోనే దిగజారుడు వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌పై వేసి వ్యాఖ్యలను తక్షణమే వెనక్కి తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో దేశవ్యాప్తంగా ఉద్యమాలు చేస్తామన్నారు.కాంగ్రెస్ పార్టీ నాయకులు గునూరు వెంకటరావు, మలపురెడ్డి కోటేశ్వరరావు, బోయిన భానుమూర్తియాదవ్, కాళ్ల సత్యనారాయణ, కత్తెర శ్రీధర్, తుట్టా రమణ, పడాల కొండలరావు, బుద్ద కిషోర్ పాల్గొన్నారు.

వారపు సంత వెలవెల

కశింకోట: స్థానిక వారపు సంత గురువారం వెలవెలబోయింది. ఎండ తీవ్రతతో ప్రజలు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు కానరాలేదు. దీంతో కూరగాయలు, పండ్లు, మసాలా దుకాణాలు బేరాలు లేక బోసిపోయాయి. మధ్యాహ్నం ఎండ తీవ్రత తగ్గడంతో ప్రజలు క్రమేపి కూరగాయలు కొనుగోలు చేశారు. ఈ నేపథ్యంలో సాయంత్రం వర్షం కురవడంతో మరోసారి కొనుగోలు, విక్రయాలకు అవరోధం కలిగింది. తర్వాత వర్షం తగ్గడంతో అమ్మకాలు సాగాయి.



కశింకోట వారపు సంత ఎండ తీవ్రతతో వెలవెల

రాహుల్‌గాంధీ వ్యాఖ్యలపై బీజేపీ నిరసన



రాహుల్‌గాంధీ వ్యాఖ్యలపై నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ నాయకులు

తుమ్మపాల: అమెరికా పర్యటనలో కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్‌గాంధీ భారత ప్రభుత్వం, భారతీయులందరీపై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. పట్టణంలో బీజేపీ జిల్లా కార్యాలయం నుంచి రాహుల్‌గాంధీ డౌన్ డౌన్ అంటూ ర్యాలీ నిర్వహించి ఆయన దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు మాట్లాడుతూ రాహుల్ గాంధీ భారత పౌరుడిగా అనర్హుడని, దేశ ప్రజల బాగోగులు అభివృద్ధి అవసరం లేదని, బంగ్లాదేశ్, రోహింగ్యాల దౌర్జన్యాలను సమర్థిస్తున్న అతడిని ఇటలీ వరకు తరిమి కొట్టాలన్నారు. ఓబీసీ మోర్చా స్టేట్ సెక్రటరీ కర్రి రామకృష్ణ మాట్లాడుతూ రాహుల్‌తోపాటు ఆయన కుటుంబం భారత వ్యతిరేకులన్నారు. అతని తాత నెహ్రూ చైనా ప్రధానమంత్రితో స్నేహం చేసి మన దేశ రహస్యాలను చూపించి 1962లో యుద్ధానికి కారకులయ్యారన్నారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కంచిపాటి సన్యాసిరావు, జిల్లా ప్రధాన కార్యదర్శులు బి.వి.ఎస్ వర్మ, ఎ. కొండబాబు, ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శులు అచ్చింనాయుడు, పిట్టా దాసుబాబు, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు సతీష్ రాజు, నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్ బి. నాగేశ్వరరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గమాంబ పుట్టుక ఉత్సవం



పల్లకి ఊరేగింపులో అమ్మవారికి పూజలు



దీపాలతో కోలాటాలు

కశింకోట: స్థానిక గవరపేటలో ప్రసిద్ధి చెందిన దుర్గమాంబ పుట్టుక ఉత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు ఆధ్వర్యంలో అమ్మవారి ఆలయం నుంచి పల్లకితో డప్పులు, వాయిద్యాలతో ఊరేగింపుగా వెళ్లి స్థానిక కనకమహాలక్ష్మి ఆలయం వెనుక అమ్మవారి పుట్ట వద్ద సంప్రదాయంగా పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ప్రతిరూపాన్ని పల్లకిలో గ్రామంలో నిలిపి పురవీధుల్లో ఊరేగించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలతో బాణసంచా కాలుస్తూ ఈ కార్యక్రమం నిర్వహించారు.

కశింకోటలో గురువారం రాత్రి 10 గంటల ప్రాంతంలో థింసా నృత్యం, మహిళల కోలాటాలు, దీపపు బిందెలతో కోలాటాలు, చిటికెన భజనలు, తోడపెద్దు సేవ, నృత్యాలు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు.



థింసా నృత్యం



మహిళల కోలాటాలు

విశేషంగా లక్ష్మీగణపతి హోమం

సింహాచలం: 98వ వార్డు సింహపురికాలనీలో కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్, యూత్ ఆధ్వర్యంలో వినాయకచవితి మహోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి సామూహిక లక్ష్మీ గణపతి హోమాన్ని విశేషంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం, అగ్ని ప్రతిష్ట, హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలను పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. లక్ష్మీగణపతి స్తోత్రాలను పఠింపజేశారు. భక్తులకు హోమ ప్రసాదాన్ని అందించారు.



హోమాన్ని నిర్వహిస్తున్న సింహపురి కాలనీ నివాసితులు

ఉత్సాహంగా స్కూలు గేమ్స్ ప్రారంభం

- కశింకోటలో మండల స్థాయి పోటీలు
- 300 మంది బాలబాలికలు హాజరు
- తొలి రోజు 6 విభాగాల్లో నిర్వహణ



కశింకోట బాలికల హైస్కూలులో యోగా పోటీలు



కబడ్డీ ఆడుతున్న బాలికలు



ఖో-ఖో ఆట



చదరంగం



వాలీబాల్

కశింకోట: మండల స్థాయి స్కూలు గేమ్స్ ప్రారంభమయ్యాయి. కశింకోట బాలికల హైస్కూలులో గురువారం ఉత్సాహ భరితంగా ప్రారంభమైన ఈ పోటీలకు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి 300 మంది బాలబాలికలు హాజరయ్యారు. తొలి రోజు బాలికలకు కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్, షటిల్, యోగా, చదరంగం ఆటల్లో పోటీలు జరిగాయి. మండల, జిల్లా స్థాయి స్కూలు గేమ్స్‌లో గతంలో పాల్గొన్న వారితోపాటు కొత్త వారు తమ ప్రతిభను ప్రదర్శించారు. పోటీల్లో ప్రతిభావంతులైన క్రీడాకారులను ఎంపిక చేసి నియోజకవర్గ స్థాయి పోటీలకు పంపనున్నట్లు పీడీ పెంటకోట కమల తెలిపారు. శుక్రవారం బాలురకు నిర్వహిస్తారు. ఈ నెల 21న బాల బాలికలకు అథ్లెటిక్స్ నిర్వహించనున్నారు. హెచ్ఎం ఎం.ఎస్. స్వర్ణకుమారి, స్కూలు విద్యా కమిటీ అధ్యక్షుడు ఆళ్ల శ్రీనివాసరావు, సభ్యురాలు పి. కల్యాణి, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్కూలు గేమ్స్‌లో చాంపియన్ అవుతా



నేను టెన్త్ క్లాస్ చదుతున్నాను. చీడికాడ మండలం జి. కొత్తపల్లికి చెందిన నేను ఇక్కడ వసతి గృహంలో ఉంటూ చదువుతున్నాను. 6వ తరగతి నుంచి ఆటలపై దృష్టి సారించి గతేడాది మండల స్థాయి స్కూలు గేమ్స్‌లో ఖో-ఖో, త్రోబాల్, లాంగ్ జంప్, రన్నింగ్‌లోను, జిల్లా స్థాయిలో త్రోబాల్‌లోను బహుమతులు గెలుచుకున్నాను. ఈ ఏడాది స్కూలు గేమ్స్‌లో జిల్లా స్థాయి చాంపియన్‌గా నిలివాలని ఆశిస్తూ పోటీలకు సిద్ధమవుతున్నాను. గత నెల స్వాతంత్ర్య వేడుకల్లో స్కూలు చాంపియన్‌గా నిలిచాను. ఖో-ఖో, కబడ్డీ, వాలీబాల్, రన్నింగ్ షాట్‌పుట్, లాంగ్ జంప్, హైజంప్, స్కిప్పింగ్, టగ్ ఆఫ్ వార్, మ్యూజికల్ చైర్ పోటీల్లో విజేతగా నిలిచి చాంపియన్ షిప్ సాధించాను. స్కూలు గేమ్స్‌లో చాంపియన్‌గా నిలవాలని ఆశిస్తున్నాను.

– బి.సంధ్య, విద్యార్థిని, కశింకోట బాలికల హైస్కూలు

ఈసారి విజేతగా నిలవాలని ఆశిస్తున్నా



9వ తరగతి చదువుతున్నాను. నక్కపల్లి మండలం రాజయ్యపేటకు చెందిన నేను ఇక్కడ వసతి గృహంలో ఉంటూ చదువుకుంటూ ఆటల పోటీలపై శ్రద్ధ చూపుతున్నాను. షటిల్, యోగా, చదరంగం, లాంగ్ జంప్ ఆటలు ఆడుతాను. గత ఏడాది స్కూలు గేమ్స్‌లో నియోజకవర్గ స్థాయి యోగాలో విజేతగా నిలిచాను. ఈ ఏడాది జిల్లా స్థాయి పోటీల్లో విజేతగా నిలవాలని ఆశిస్తున్నాను.

–వై మోక్ష భారతి, విద్యార్థిని, బాలికల హైస్కూలు, కశింకోట

యోగా పోటీలకు సిద్ధమవుతున్నా



6వ తరగతి చదువుతున్నాను. మండల స్థాయి యోగా పోటీలకు సిద్ధమవుతున్నాను. 1వ తరగతి నుంచి యోగా ప్రాక్టీసు చేస్తున్నాను. 20 వరకు ఆసనాలు వేయగలను. గతంలో విశాఖలో చదివినప్పుడు యోగాలో బహుమతి పొందాను. ఈ సారి స్కూలు గేమ్స్‌లో విజేతగా నిలవాలని ఆశిస్తున్నాను.

– పి.అక్షయ్, బాలిక, బాలికల హైస్కూలు, కశింకోట

విజేతలు వీరే...

విజేతల వివరాలను పీడీ పెంటకోట కమల వెల్లడించారు. అండర్ -14 కబడ్డీలో కశింకోట, వెదురుపర్తి అండర్ - 17 విభాగంలో కశింకోట, కొత్తపల్లి జట్లు ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించాయి. అండర్ - 14 ఖో-ఖోలో కశింకోట, తేగాడ కేజీబీవీ, అండర్ - 17 తేగాడ, తాళ్లపాలెం గురుకులం, అండర్ - 14 వాలీబాల్‌లో తాళ్లపాలెం గురుకులం, వెదురుపర్తి, అండర్ - 17 తాళ్లపాలెం గురుకులం, కశింకోట, అండర్ - 14 షటిల్‌లో వెదురుపర్తి, తాళ్లపాలెం గురుకులం, అండర్ - 17 వెదురుపర్తి, ఏఎస్ పేట ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. అండర్ - 17 చదరంగం పోటీలో కె. సునంద, జి.సరస్వతి (ఏఎస్ పేట), బి.సంధ్యారాణి, బి.నిఖిత (తాళ్లపాలెం గురుకులం), టి.రేవతి (తాళ్లపాలెం), అండర్ -14 విభాగంలో ప్రేమిత(తాళ్లపాలెం గురుకులం), ఎన్. లిఖిత (తేగాడ కేజీబీవీ), టి. జ్యోతి (తాళ్లపాలెం హైస్కూలు), వై.మోక్ష భారతి, బి.కావ్యశ్రీ(కశింకోట) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్థి, పంచమ స్థానాలు సాధించారు. అండర్ -11 యోగాలో పి అక్షయ, కె.ధనలక్ష్మి, బి.పూర్ణ(కశింకోట) వి.రష్మిత (తాళ్లపాలెం గురుకులం), అండర్ -14 విభాగంలో పి.భవ్యశ్రీ, బి.దేవి, వి.సాహితీసౌజన్య, పి.లోచన, పి. నిత్యనయని, సిహెచ్ తేజశ్రీ, కె.యామిని, అండర్ -17 విభాగంలో డి.గంగోత్రి, ఎల్. జ్యోతిర్మయి, బి. రమ్యజ్యోతి, ఎం.సంధ్య, ఎం. పూర్ణదుర్గ, ఎం. గ్రీష్మ, స్వాతి విజేతలుగా నిలిచారు.